VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 248
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
ఆదివారం 15 ఫిబ్రవరి 2026



# బడ్జెట్ ప్రతి స్పీకర్ కు అందజేసిన పయ్యావుల కేశవ్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా తొలి ప్రతిని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ,స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కి అసెంబ్లీ స్పీకర్ చాంబర్ లో అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు , సీఎం రమేష్ , గంట శ్రీనివాసరావు , విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

## సి ఎం, డిప్యూటీ సీఎం లతో పయ్యావుల కేశవ్



## ఏపీ 2026-27 వ్యవసాయ బడ్జెట్



**అమరావతి,కలంకౌంటర్ :** 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ప్రధాన కార్యక్రమాలు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకునేలా బడ్జెట్ కొత్త కార్యక్రమాల అమలు. వివిధ రంగాల అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కేటాయింపులు. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రూ.30 వేల కోట్లు. 3 సిటీ ఎకనమిక్ రీజియన్లు-విశాఖ, అమరావతి, తిరుపతి. వీబీ జీ రాం జీ పథకం-రూ. 8,365 కోట్లు ఏపీ వెల్త్ ఫండ్ -- రూ. 100 కోట్లు నేతన్నలకు ఉచిత విద్యుత్-పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్ కు 200 యూనిట్లు ఇవ్వాలని నిర్ణయం. నేతన్నలకు ఉచిత విద్యుత్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలు. లక్ష కుటుంబాలకు లబ్ది. పాఠశాలలు,



అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ భేటీ.










అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసిన కూటమి మహిళా ఎమ్మెల్యేలు.
-అమరావతి,కలంకౌంటర్ :



విజయవాడ అమరావతి శాసన సభ సమావేశాల సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని కలిసిన మహిళా మంత్రులు ,ఎమ్మెల్యేలు.
-అమరావతి,కలంకౌంటర్ :

# 2026-27 రాష్ట్ర బడ్జెట్ రూ. 3,32,205 కోట్లతో

● రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంతో బడ్జెట్ రూపొందించామన్న పయ్యావుల ● రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు ● అమరావతి నిర్మాణానికి రూ. 6 వేల కోట్లు ● విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ 28 వేల కోట్లు ● రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు





**అమరావతి,కలంకౌంటర్ :** 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. రూ. 3,32,205 కోట్లతో బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పంతో ఈ బడ్జెట్ ను రూపొందించామని చెప్పారు.

**బడ్జెట్ వివరాలు:** మొత్తం బడ్జెట్ - రూ.3,32,205 కోట్లు , రెవెన్యూ వ్యయం - రూ.2,56,143 కోట్లు, రెవెన్యూ లోటు - రూ.22,002 కోట్లు , మూలధన వ్యయం - రూ.53,915 కోట్లు, ద్రవ్య లోటు - రూ.75,868 కోట్లు, సర్దుబాటు నిధి - రూ.1,500 కోట్లు , రాజధాని అమరావతి నిర్మాణానికి - రూ.6,000 కోట్లు, విశాఖ ఆర్థిక ప్రాంతానికి (ఈ ఆర్థిక ప్రాంతం పరిధిలోకి పది జిల్లాలు) - రూ.28,000 కోట్లు , రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు - రూ.13,546 కోట్లు, విద్యుత్ రంగానికి - రూ.13,934 కోట్లు , పరిశ్రమలకు - రూ.3,161 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు - రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు - రూ.4,000 కోట్లు, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు - రూ.30,000 కోట్లు , వీబీ జీ రామ్ జీకి - రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి - రూ.5,451 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్‌కు - రూ.1,037 కోట్లు, తల్లికి వందనంకు - రూ. 9,668 కోట్లు, మహిళా, శిశు సంక్షేమానికి - రూ. 4,581 కోట్లు , సాగు నీటి ప్రాజెక్టులకు - రూ. 9,906 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు - రూ. 1,927 కోట్లు, అన్నదాత సుఖీభవకు - రూ. 6,600 కోట్లు స్కిల్ డెవలప్‌మెంట్ కు - రూ. 1,232 కోట్లు, యూత్ అండ్ స్పోర్ట్స్‌కు - రూ. 438 కోట్లు , మనబడి- మన భవిష్యత్ పథకానికి - రూ. 1,500 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాకు - రూ. 707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకానికి - రూ. 654 కోట్లు, స్కాలర్‌షిప్ లకు - రూ. 3,836 కోట్లు, సమగ్ర శిక్షణకు - రూ. 2,946 కోట్లు, ఉన్నత విద్యకు - రూ. 2,566 కోట్లు, పాఠశాల విద్యకు - రూ. 32,308 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు - రూ. 19,306 కోట్లు, డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి - రూ. 2,161 కోట్లు, మత్స్యకారులకు - రూ. 260 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు - రూ. 6,105 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి - రూ. 500 కోట్లు.



### గణనీయంగా తగ్గిన రెవెన్యూ లోటు...

2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లు, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు, 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 80,567.47 కోట్లు, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లు

**2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రధాన విభాగాలు, శాఖలవారీ కేటాయింపులు:**
పాఠశాల విద్య -- రూ.32,308.32 కోట్లు, బీసీ వెల్ఫేర్ -- రూ.23,650.88 కోట్లు, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ -- రూ.22,941.54 కోట్లు, వైద్యారోగ్యం -- రూ.19,306.04 కోట్లు, నీటివనరులు -- రూ.18,223.67 కోట్లు, పట్టణాభివృద్ధి, పురపాలిక శాఖ -- రూ.14,538.68 కోట్లు, విద్యుత్ రంగం -- రూ.13,934.25 కోట్లు, వ్యవసాయ రంగం -- రూ.11,745.21 కోట్లు, సాంఘీక సంక్షేమం -- రూ.11,118.84 కోట్లు, ఈడబ్ల్యుఎస్ సంక్షేమం -- రూ.10,699.33 కోట్లు

**రూపాయి రాక..** పన్నుల ద్వారా ఆదాయం -- 38 శాతం, పన్నేతర ఆదాయం -- 3 శాతం , బహిరంగ మార్కెట్ రుణాలు -- 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా -- 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ -- 10 శాతం,

**రూపాయి పోక..** సంక్షేమం -- 17 శాతం, విద్య -- 11 శాతం, ఆర్థికం -- 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి -- 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం -- 6 శాతం, జలవనరులు -- 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ -- 4 శాతం, విద్యుత్ రంగం -- 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు -- 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు...) -- 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు -- 18 శాతం



# ఎస్సీల సంక్షేమానికి రూ. 20,644 కోట్ల కేటాయింపు ఎస్సీల అభ్యున్నతి పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధికి నిదర్శనం

● బడ్జెట్ లో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిన సీఎం చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు ● మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**అమరావతి, కలంకౌంటర్ :** బడ్జెట్ లో ఎస్సీల సంక్షేమానికి రూ. 20,644 కోట్ల కేటాయింపు ఎస్సీల అభ్యున్నతి పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ అన్నారు. శనివారం నాడు విడుదల చేసిన పత్రిక మంత్రి మాట్లాడుతూ....బడ్జెట్ లో ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిన సీఎం చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు. ఎస్సీల సంక్షేమానికి రూ. 20,644 కోట్ల కేటాయింపు ఎస్సీల అభ్యున్నతి పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌళిక సదు-పాయాల కల్పనకు రూ.300 కోట్లు కేటాయింపు పేద పిల్లల చదువుల పట్ల సీఎం ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధకు అద్దం పడుతోంది. గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో ఎస్సి సంక్షేమానికి ఖర్చు చేయడానికి జగన్ కి చేతులు రాలేదు. నాడు నిధులు దారి మళ్ళించి ఎస్సీ సబ్ ప్లాన్ ని సైతం జగన్ నిర్వీర్యం చేశారు. వైసీపీ పాలనలో ఎస్సి సంక్షేమాన్ని పట్టించుకోకపోగా ఎస్సీలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



# వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన హోం మంత్రి అనిత

**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతిలో శాసన మండలిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను హోం మంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఈ బడ్జెట్ కేవలం జమా-ఖర్చుల లెక్క మాత్రమే కాదని, రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే అభివృద్ధి బడ్జెట్ అని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని వేగవంతం చేయాలన్న ధృడసంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. అమరావతికి శాశ్వత రాజధానిగా చట్టబద్ధ హోదా కల్పించే ప్రక్రియ ప్రారంభమైందని ఆమె వెల్లడించారు. అమరావతికి అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో రూ.57,868 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు వివరించారు. గత పాలనలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. పోలీసు శాఖకు త్వరలోనే 3,000 కొత్త వాహనాలను అందించనున్నట్లు ప్రకటించారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు వంటి ఆధునిక నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శాసన మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హోం మంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీ బడ్జెట్ 2026-27పై యనమల రామకృష్ణుడు కామెంట్స్

●ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్ అని కితాబు ● ఆర్థిక క్రమశిక్షణ, రుణ నియంత్రణకు ప్రాధాన్యం ● పరిశ్రమలు, పెట్టుబడులకు పెద్దపీట వేయడంపై హర్షం ●సామాజిక న్యాయం దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందని వ్యాఖ్య

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ 2026-27 వార్షిక బడ్జెట్‌పై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశంసలు కురిపించారు. ఇది ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్ అని అభివర్ణించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించారని అభినందించారు. ఈ సందర్భంగా యనమల స్పందిస్తూ... “బడ్జెట్‌లో చేసిన కేటాయింపులతో ప్రజా ఆకాంక్షలు నెరవేరతాయని ఆశిస్తున్నాం. ముఖ్యంగా రుణాలను నియంత్రించేలా ఈ బడ్జెట్ ఉంది. రుణాల రీ-షెడ్యూల్, వడ్డీ తగ్గించడం వంటి చర్యల ద్వారా ఆర్థిక శాఖ రాష్ట్రాన్ని అప్పుల నుంచి బయటపడేస్తుందన్న నమ్మకం ఉంది” అని తెలిపారు. పరిశ్రమలు, పెట్టుబడులు, అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమని యనమల హర్షం వ్యక్తం చేశారు.

అదే సమయంలో, సామాజిక న్యాయం దిశగా బడ్జెట్‌ను తీర్చిదిద్దడం అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తం మీద ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బీసీలకే సింహభాగం బడ్జెట్ కేటాయింపులపై మంత్రి సవిత


## సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



**అమరావతి,కలంకౌంటర్ :** బీసీల అభ్యున్నతి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందని, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి చరిత్రలో కనీవినీ ఎరుగని కేటాయింపులు చేశారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. మూడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ప్రవేశ పెట్టిన మూడు బడ్జెట్లోనూ నిధుల కేటాయింపులు పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. నూతన బడ్జెట్ లో ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తంచేశారు. 2026-27 బడ్జెట్ లో రూ.51,021 లక్షల కోట్లు బీసీ సంక్షేమానికి కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి పయ్యావులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 2026-27 బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలమైనదన్నారు. ముఖ్యంగా బీసీల ఉన్నతికి బడ్జెట్ లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 2024-25 బడ్జెట్ లో రూ.39,007 కోట్లు, 2025-26 బడ్జెట్ 47,456 కోట్లు, 2026-27 బడ్జెట్లో 51,021 కోట్లు కేటాయించారన్నారు. అందులో ఈడబ్ల్యూఎస్ సంక్షేమానికి రూ.10,669 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. 2025-26లో రూ.10,614 కోట్లు, 2024-25లో రూ.10,273.80 కోట్లు కేటాయించామన్నారు. నూతన బడ్జెట్‌లోనూ ఆదరణ 3.0 పథకానికి మరో రూ.1000 కోట్లు, చేనేతలకు, సెల్లూన్లకు ఉచిత విద్యుత్ కోసం రూ.150 కోట్లు, రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ఇలా ఏటా బీసీ సంక్షేమానికి నిధులు కూటమి ప్రభుత్వం కేటాయింపులు పెంచుతూ వస్తోందన్నారు. చరిత్రలో ఎరుగని విధంగా, సింహభాగం నిధులు బీసీల సంక్షేమానికి కేటాయించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ ఇటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. రాయలసీమ ను గ్లోబల్ హార్టీ కల్చర్ గా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం రూ.30 వేల కోట్లు కేటాయిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా బడ్జెట్ ను రూపకల్పన చేశామన్నారు. వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి కూడా ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో నిధులు కేటాయించామన్నారు, బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబుకు, ఆర్థిక మంత్రి పయ్యావులకు మంత్రి సవితకు ఆ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు.

# రైతు భరోసా కు ప్రాధాన్యత

## -రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అసెంబ్లీ మీడియా పాయింట్లో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వారసత్వంగా వదిలిపెట్టిన రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమిస్తూ, అభివృద్ధి, సంక్షేమం మరియు రైతు భరోసాకు ప్రాధాన్యత ఇచ్చిన 2026-27 బడ్జెట్‌ను స్వాగతించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సారథ్యంలో ప్రతి సంవత్సరం ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకుంటూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా భవిష్యత్తుపై నమ్మకం కల్పిస్తోందని ఆయన తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ విషయంలో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 4.41 శాతంగా ఉన్న రెవెన్యూ లోటు ఇప్పుడు 1.11 శాతానికి తగ్గించడం, ద్రవ్యలోటు 3.84 శాతానికి నియంత్రించడం రాష్ట్ర ఆర్థిక పురోగతికి స్పష్టమైన సూచికలని మంత్రి వివరించారు. మూలధన వ్యయం విషయంలో గత ప్రభుత్వం రూ.27,000 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ఈ బడ్జెట్‌లో రూ.48,697 కోట్లు ప్రతిపాదించడం రోడ్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణానికి పెద్ద ఊతమిస్తుందని ఆయన అన్నారు. నీటిపారుదల రంగంలో గత ప్రభుత్వం రూ.10,969 కోట్లు కేటాయించగా ఈ ప్రభుత్వం రూ.18,229 కోట్లు ప్రతిపాదించడం ద్వారా గత ప్రభుత్వం పూర్తి చేయని చింతలపూడి లాంటి ప్రాజెక్టులు 2026-27లో ప్రారంభించే దిశలో అనుమతులు సాధించే విషయంలో ముందడుగు పడిందని మంత్రి తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి నల్లమల్ల సాగర్ ప్రాజెక్టు చేపట్టడం, రూ.30,000 కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయడం కరవు ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చే చారిత్రాత్మక నిర్ణయాలని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ రంగంలో గత ప్రభుత్వం మొత్తం రూ.51,292 కోట్లు కేటాయించగా, ఈ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనారిటీ, మహిళా సంక్షేమ కార్యక్రమాలకు కలిపి రూ.91,529 కోట్లు ప్రతిపాదించడం సంక్షేమంలో నిజమైన నిబద్ధతకు నిదర్శనమని మంత్రి వివరించారు. గత ప్రభుత్వం 43 లక్షల మందికి అమ్మ ఒడి ఇవ్వగా, ఈ ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం అందిస్తోందని ఆయన తెలిపారు. పెన్షన్ విషయంలో గత ప్రభుత్వం రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చి అయిదేళ్ళు చివరిలో మాత్రమే అమలు చేయగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీ ప్రకారం రూ.4,000 పెన్షన్ అమలు చేయడంతోపాటు అధికారంలో లేని రెండు నెలలకు కూడా చెల్లించిందని మంత్రి పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ నిధి విషయంలో గత ప్రభుత్వం రూ.7,500 కోట్లు కేటాయించి కేవలం రూ.880 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించి రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.1,220 కోట్లు ఖర్చు చేయడం ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుతుందని ఆయన తెలిపారు. జల జీవన్ మిషన్‌కు గత ప్రభుత్వం రూ.27,000 కోట్లు కేటాయించి కేవలం రూ.2,000-2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ఈ ప్రభుత్వం రూ.4,800 కోట్లు కేటాయించి కేంద్ర ప్రాయోజిత పథకాన్ని పూర్తిగా వినియోగించుకుంటోందని ఆయన తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.57,868 కోట్ల విలువైన పనులకు పరిపాలన అనుమతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. గృహనిర్మాణ రంగానికి రూ.6,250 కోట్లు కేటాయించడం ద్వారా ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇంటి స్థలంతో సహా ఇల్లు నిర్మించే ముఖ్యమంత్రి లక్ష్యం సాకారమవుతోందని పార్థసారథి మంత్రి వివరించారు. ఈ సమగ్ర మరియు జవాబుదారీ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు పటిష్టమైన పునాది వేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# జన రంజకం రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలకు ప్రతిబింబం

## -విశ్లేషించిన అంచనాల కమిటీ మాజీ చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పక్కా ప్రణాళిక అని మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ కొనియాడారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 3,32,205 కోట్ల భారీ బడ్జెట్‌పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. చీకటి నుంచి వెలుగులోకి గత ప్రభుత్వం మిగిల్చిన 9.74 లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమించి, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపింది. ఇది కేవలం పద్దుల ప్రకటన కాదు... “అగాధం నుంచి ఆకాశం వైపు రాష్ట్రం వేస్తున్న ధైర్యవంతమైన ముందడుగు” అని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి వరుసగా మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆయన సమర్థతకు నిదర్శనమని వ్యాస్ అభినందించారు తల్లికి వందనం’ పథకానికి 9,668 కోట్ల కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి తల్లికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు అన్నదాత సుఖీభవ’కు 6,600 కోట్లు కేటాయించడం రైతు పక్షపాతి ప్రభుత్వాన్ని ప్రతిబింబిస్తోందన్నారు బిసి సంక్షేమానికి 23,650 కోట్లు, సామాజిక సంక్షేమానికి 11,118 కోట్లు కేటాయించడం ద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టమైందని బూరగడ్డ అమరావతికి 6 వేల కోట్లు, విశాఖ ఆర్థిక ప్రాంతానికి 28,వేల కోట్లు, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు 30 వేల కోట్లు కేటాయించడం రాష్ట్ర ప్రాంతీయ సమతుల్యతకు నిదర్శనం అన్నారు. పాఠశాల విద్యకు ?32,308 కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ?1,232 కోట్లు కేటాయించడం యువత భవిష్యత్తుకు బలమైన పునాది అన్నారు ఇలా ప్రతి రంగానికి తగిన విధంగా నిధులు కేటాయించబడ్డ ఈ బడ్జెట్ కు, విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువనేత లోకేష్ లకు వేద వ్యాస్ ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ లో మరో కేసు నమోదు చేసిన సీఐడీ

- డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరఫరా చేసే టెండర్లలో అక్రమాలు
- రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు సమాచారం
- విచారణ బాధ్యతలు సిట్ చీఫ్ రాజశేఖర్ బాబుకు అప్పగింత



**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో సీఐడీ అధికారులు మరో కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీఎస్బీసీఎల డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా చేసే రవాణా టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై తాజా కేసు నమోదయింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా వ్యవహరించారని కేసు నమోదు చేశారు. రవాణా టెండర్లలో రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు అక్రమాలను పాల్పడినట్టు సమాచారం. ఈ కేసు విచారణ బాధ్యతలను సిట్ చీఫ్ ఎస్పీ రాజశేఖర్ బాబుకు అప్పగించారు. మరోవైపు, లిక్కర్ స్కామ్ లో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కేసిరెడ్డి బెయిల్ పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంలో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయంపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ స్కామ్ లో రూ. 3,500 కోట్లకు పైగా అక్రమ లావాదేవీలు జరిగినట్టు సిట్ అధికారులు అంచనా వేశారు. ఈ కేసును ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది. పలువురు వ్యక్తులకు ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని అరెస్ట్ చేశారు. మరో 9 మంది విదేశాల్లో తలదాచుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు.

# కృష్ణా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం కృష్ణా జిల్లా విభాగం నూతన కార్యవర్గ ఎన్నికలు చిలకలపూడిలోని కే గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర అధ్యక్షులు బూరాడ మధుబాబు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# దామోదరం సంజీవయ్యకు జగన్ నివాళి

- నేడు దామోదరం సంజీవయ్య జయంతి
- దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ జగన్ కితాబు
- పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని ప్రశంస



**అమరావతి,కలంకౌంటర్ :** దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నేడు. ఈ సందర్భంగా ఆయనకు వైసీపీ అధినేత జగన్ నివాళులు అర్పించారు. ఎక్స్ వేదికగా జగన్ స్పందిస్తూ... అణగారిన వర్గాల ఆశలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని కితాబునిచ్చారు. ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.

# ప్రజాస్వామ్య దేవాలయంలో భావి భారత పౌరులు

## -అసెంబ్లీలో విద్యార్థుల పర్యటన



**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతిలోని శాసనసభను వివిధ పాఠశాలల విద్యార్థులు సందర్శించి సభా కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించారు. చట్ట సభలు ఎలా పనిచేస్తాయి? ప్రజా సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి? వంటి అంశాలపై విద్యార్థులు ప్రత్యక్ష అనుభవం పొందారు. ఇప్పటివరకు 22 పాఠశాలల నుండి మొత్తం 798 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సభా వ్యవహారాలను పరిశీలించిన విద్యార్థులు ప్రజాస్వామ్య ప్రక్రియపై అవగాహన పెంపొందించుకున్నారు. విరామ సమయంలో మంత్రులు వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి విద్యార్థుల వద్దకు వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ పర్యటన ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై సమగ్ర అవగాహన పెరిగిందని విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ చొరవ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# దామోదరం సంజీవయ్య కి ఘన నివాళులర్పించిన జిల్లా ఎస్పీ



**ఒంగోలు,కలంకౌంటర్ :** రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన మహనీయుడు దామోదరం సంజీవయ్య అని జిల్లా ఎస్పీ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలందించిన దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి జిల్లా ఎస్పీ , పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14వ తేదీన కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దపాడులో జన్మించారని, చిన్ననాటి నుంచే ప్రతిభ కనబరిచిన ఆయన చదువులోనే కాకుండా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ విశేషంగా రాణించారన్నారు.



తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎస్పీ బి ఉమా మహేశ్వర్.

-బాపట్ల,కలంకౌంటర్ :







# న్యాయ శాఖకు రూ. 1352 కోట్లు బడ్జెట్ కేటాయింపు - రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్




**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న న్యాయశాఖకు న్యాయ పాలన కోసం బడ్జెట్ లో రూ. 1352.49కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. న్యాయ శాఖకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో రూ. 1222.03 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్ లో అదనంగా రూ. 130.46 కోట్లు కేటాయించి మొత్తం రూ. 1352.49 కోట్లతో బడ్జెట్ ప్రకటించడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. హైకోర్టు భవన పనుల నిమిత్తం రూ. 30 కోట్లు, న్యాయవాదుల సంక్షేమ సంఘాల కోసం రూ. 32 కోట్లు, బాధితుల పరిహార పథకం కోసం రూ. 2 కోట్లు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కోర్టు భవనాల నిర్మాణాలు, ఇతర మౌళిక వసతుల కల్పన కోసం రూ. 180.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ పటిష్టతకు, న్యాయవాదుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో 27 కోర్టు హాల్లు, 15 నివాస గృహ సముదాయాల నిర్మాణానికి రూ 216.27 కోట్ల పరిపాలన అనుమతులను ఇవ్వడంతో పాటు న్యాయవాదుల సంక్షేమం కోసం మ్యాచింగ్ గ్రాంట్ కింద రూ. 46 కోట్ల మొత్తాన్ని 1150 మ-రణించిన న్యాయవాదుల కుటుంబాలకు అందించడం జరిగిందన్నారు. న్యాయమూర్తుల సామర్థ్యాన్ని పెంపొందిచేందుకు జ్యూడిషల్ అకాడమీ ద్వారా 19 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి 3998 మంది న్యాయ మూర్తులకు శిక్షణ ఇచ్చినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

# రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి నిదర్శనంగా 2026--27 బడ్జెట్ - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి,కలంకౌంటర్ :** అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వరుసగా మూడోసారి ప్రవేశపెట్టిన 2026--27 రాష్ట్ర బడ్జెట్‌పై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ క్యాంపు కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. రూ. 3,32,205 కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో పేదలు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మిక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2.0 వంటి పథకాలకు భారీ కేటాయింపులు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రవాణా, రహదారులు ఒ భవనాలకు రూ. 9,856 కోట్లు, యువజన--క్రీడల రంగానికి రూ. 439 కోట్లు కేటాయించడం ద్వారా మౌలిక వసతుల అభివృద్ధితో పాటు యువత భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా ఇస్తోందని మంత్రి తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమన్వయపరిచిన ఈ బడ్జెట్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించనుందని, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత బలోపేతం అవుతుందన్న నమ్మకాన్ని మంత్రి మండిపల్లి వ్యక్తం చేశారు.

# జోడుగుడుల దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శివపార్వతులను వేద పండితుల మంత్రోచ్చారణలతో పుణ్య దంపతులచే స్వామివారిని పెండ్లి కుమారుని గాను అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో మేళతాళలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవనూరి వీరబాబు సభ్యులు తోట పవన్, దింటకుర్తివరప్రసాద్, చింత శ్రీనివాస్, తిక్కిశెట్టి మోహన్ రావు, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, ఆలయ అర్చకులు వేద పండితులు పుణ్య దంపతులు భక్తులు పాల్గొన్నారు.

# అప్పు ఎంత ఉందో చెప్పలేదు: బడ్జెట్ పై బుగ్గన విమర్శలు

- బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారన్న బుగ్గన
- గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టు ఉందని వ్యాఖ్య
- వైసీపీ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని వెల్లడి

**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ శాసనసభలో ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. అసెంబ్లీలో అబద్ధాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

# నీట్, ఐఐటీల్లో సీట్లు సాధించేలా ఎస్టీ విద్యార్థులకు శిక్షణ

- ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.9 వేలకోట్లు కేటాయింపు
- సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి
- సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి,కలంకౌంటర్ :** నీట్, ఐఐటీల్లో సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుల్లో ముందుంటున్నారని, ఉన్నత కొలువులు సాధించాలనే పట్టుదల వారిలో పెరిగిందన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకుంటారనడంలో ఎటువంటి సందేహం లేదని అభిప్రాయపడ్డారు. సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. రూ. 50 లక్షలు కేటాయించి సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రసంగించారు.

**సేవాలాల్ సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమే..** 'ఉమ్మడి అనంతపురం జిల్లా, గుత్తి మండలం, రామ్‌జీ నాయక్ తండాలో భీమా నాయక్, ధర్మణి మాత దంపతులకు సంత్ శ్రీ సేవాలాల్ జన్మించారు. సేవాలాల్ దూరమై శతాబ్దాలు గడుస్తున్నా బంజారాల గుండెల్లో ఆరాధ్య దైవంగా నిలిచారు. బంజారాలలో సేవాలాల్ చైతన్యాన్ని తీసుకొచ్చారు. ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శంగా ఉంటాయి. దేశమంతా తిరిగి బంజారాలాను ఒకతాటిపైకి తీసుకొచ్చారు. సేవాలాల్ సేవలను నెమరువేసుకునే బాధ్యత మనందరిపై ఉంది. ఆయన మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టం. చిన్నతనం నుంచే సేవాలాల్ సామాజిక సేవతో మెలిగారు. ఎవరైనా ఆకలితో ఉంటే ఆయన వద్దనున్న ఆహారాన్ని పక్కవారికి ఇచ్చి ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి. జంతుబలిని వ్యతిరేకించారు. జంతువులను బలివ్వాలనుంటే ముందు నన్ను బలి ఇవ్వండని చెప్పారు. కానీ ఈ రోజుల్లో ఫోటోలకు జంతువులను బలిఇచ్చి హింసను సమర్థించుకునంటున్నారు' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**గిరిజన బిడ్డల్లో పట్టుదల పెరిగింది..** 'మహిళా సమానత్వం గురించి మనం ఇప్పుడు మాట్లాడుకుంటన్నాం. ఆనాడే స్త్రీ సమానత్వ ఆవశ్యకతను సేవాలాల్ చెప్పారు. తన జీవితాన్ని అరణ్యవాసులు, సంచార జాతులకోసం కేటయించారు. సంచార జీవనం కాకుండా తండాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించారు. సాయం చేయడం, ప్రకృతిని ప్రేమించడంతో పాటు ధర్మాన్ని పాటించాలని హిత బోధ చేశారు. ఆయన అందరికీ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తారు. అదే విధంగా పేదల కోసం పని చేసిన వ్యక్తి ఎన్టీఆర్. గిరిజన పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి ఉన్నత విద్యను అందించాలని గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత తండాలను అభివృద్ధి చేయాలని ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాం. గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చేసేందుకు వారి ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నాం. అరకు కాఫీ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించింది. గిరిజన ప్రాంతాల్లో వనరులకు కొదవలేదు..వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసుతలు కల్పిస్తున్నాం. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ. 9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించాం. సంత్ శ్రీ సేవాలాల్ లాంటి మహనీయుణ్ని నిత్యం తలచుకుని సమాజ హితం కోసం ప్రతి ఒక్కరం పని చేయాలి' అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు మిరియాల శిరీషా దేవి, తోయక జగదీశ్వరి, చిర్రి బాలరాజు, గిరిజన నేతలు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనం

## -పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 కోట్లతో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మూడోసారి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ గాడి తప్పిన వ్యవస్థను ఆర్థిక సంక్షోభం నుంచి పురోగతి వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించే విధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మూలధన వ్యయం విషయంలో గత సంవత్సరం రూ. 39,498 కోట్ల నుండి 16 శాతం పెంచి రూ. 53,917 కోట్లకు చేర్చడం ప్రభుత్వం అభివృద్ధి పట్ల చూపుతున్న నిబద్ధతకు నిదర్శనమని నాదెండ్ల మనోహర్ తెలిపారు. అదేవిధంగా పన్నుల ద్వారా రెవెన్యూ వసూళ్ళు గత సంవత్సరం రూ. 98,025 కోట్ల నుండి రూ. 1,25,846 కోట్లకు పెరగడం రాష్ట్ర ఆర్థిక పునరుద్ధరణలో జరుగుతున్న నిరంతర కృషికి రుజువని ఆయన అన్నారు. సంక్షేమ రంగంలో సూపర్ సిక్స్ పథకాలకు ఎటువంటి రాజీ లేకుండా నిధులు కేటాయించడం, ముఖ్యంగా దీపం పథకం, ఆర్టీసీలో మహిళల కు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేస్తున్న తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రూ. 10,950 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే 93 శాతం మంది రైతులకు నేరుగా చెల్లింపులు జరపడం భారత దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శవంతంగా నిలిపిందని ఆయన వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ. 57,000 కోట్లతో 98 ప్రాజెక్టులు వేగంగా సాగుతున్నాయని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 60 శాతం పురోగతి సాధించి గోదావరి పుష్కరాల నాటికి జాతికి అంకితం చేయనున్నారని నాదెండ్ల మనోహర్ తెలిపారు. నీతి ఆయోగ్ సహకారంతో మూడు ఎకనామిక్ గ్రోత్ కారిడార్లు ఏర్పాటు చేయడం, రాయలసీమలో దేశంలోనే తొలిసారి హార్టికల్చర్ హబ్ స్థాపించడం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మిలుపైన అడుగులని ఆయన అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారానికి దోహద పడే ప్రత్యేకమైన సావరిన్ వెల్త్ ఫండ్‌ని రూ. 100 కోట్లతో ప్రారంభించడం భారతదేశంలో ఇదే తొలిసారని, ఇది పారిశ్రామికవేత్తలు మరియు పెట్టుబడిదారుల కు విశ్వాసం కల్పించే చారిత్రాత్మక నిర్ణయమని ఆయన ప్రశంసించారు. డేటా లేక్ ఏర్పాటు ద్వారా 36 శాఖల నుండి 900 సేవలను మీసేవ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించడం స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ నినాదాన్ని ఆచరణలో చూపిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 53,752 కోట్లు కేటాయించి ఉద్యానవనాలు, ఆక్వాకల్చర్, ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ రంగాలలో కొత్త ఆలోచనలతో మార్పు తీసుకొస్తున్న వ్యవసాయ మంత్రి అచ్చెన్న నాయుడు గారిని, పంచాయతీరాజ్ శాఖకు రూ. 22,942 కోట్లు సాధించి గ్రామసభలు మరియు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిని, పెట్టుబడుల ఆకర్షణలో అద్భుతాలు సృష్టిస్తున్న మంత్రి నారా లోకేష్ ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం మరియు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, భారతీయ జనతా పార్టీ అండదండలు మరియు కేంద్ర ప్రభుత్వ మద్దతుతో కూటమి ప్రభుత్వం గత ఐదేళ్లలో విధ్వంసమైన రాష్ట్రాన్ని 19 నెలల్లోనే పురోగతి పథంలో పెట్టగలిగిందని నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఈ సమగ్ర మరియు పురోగమన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గారికి జనసేన పార్టీ తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.




Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com